ప్రజాశక్తి

ఆదివారం 15 జూన్ 2025   8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

నేటి నుండి సముద్రంలో మత్స్య వేట

ముగిసిన నిషేధ సమయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : సముద్రంలో మత్స్య సంపద కోసం వేట ఆదివారం నుండి ప్రారంభం కానుంది. 61 రోజుల వేట విరామం తర్వాత ఆదివారం తెల్ల వారుజాము నుండి గంగపుత్రులు కడలి బాటపడుతున్నారు. సముద్రంలో మత్స్య సంపద పెరిగేందుకు ప్రతి ఏడాది వేసవిలో అనుకూలమైన వాతావరణం ఉంటుంది. దీంతో మత్స్య ఉత్పత్తుల పెరుగుదలకు ప్రభుత్వం ఆ సమయంలో సముద్రంలో వేటను నిషేధిస్తుంది. ఈ క్రమంలోనే ఎప్పటి లాగానే ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు వేటను నిషేధించింది. వేట నిషేధంతో మర పడవలు, బోట్లు సముద్రంలో వేటకు వెళ్ల కుండా మెరైన్ పోలీసులు, తీర రక్షణ దళ విభాగం సమిష్టిగా పర్యవేక్షిస్తాయి. వేట నిషేధం ఉల్లంఘించి సముద్రంలోకి వెళ్లే బోట్లకు రూ.2,500 జరిమానా విధిస్తారు. అంతేకాకుండా సముద్ర ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంటారు. ఈ సమయంలో ఎవరూ కడలిలోకి వెళ్లడానికి సాహసించరు. దీంతో ఈ సమయంలో గంగా పుత్రులందరూ వేటకు ఉపయోగించే పడవలు, వలలు అన్ని బాగు చేసుకుంటారు. అలాగే రెండు నెలల పాటు ఉపాధి లేక పోవడంతో ప్రభుత్వాలు వారికి కొంత ఆర్థిక సహాయం చేస్తాయి. గత వైసిపి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10 వేలు అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేసింది. అయితే 2024లో వివిధ కారణాలను చూపుతూ మత్స్యకార భరోసాను నిలిపిసింది. దీంతో వేట నిషేధంతో భతి కోల్పోయిన కుటుంబాలు ప్రభుత్వసాయం అందక తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు అప్పులు చేసుకుని జీవించాల్సి వచ్చింది. కష్ణాజిల్లా పరిధిలో సముద్రతీరాన మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, కత్తివెన్ను మండలాలన్నాయి. 111 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం 13,331 మంది మత్స్యకారులు 2,263 బోట్లలో వేట సాగిస్తారు. వీటి ద్వారా 10,06,189 టన్నుల మత్స్య సంపద ప్రతి ఏటా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. ఈ ఏడాది కష్ణాజిల్లాలో మత్యకార భరోసా పథకానికి జిల్లాలో 13,331 మంది మత్స్యకారులను అధికారులు గుర్తించారు. కానీ 13,077 మందినే వేట నిషేధ భతికి అర్హులుగా గుర్తించారు. వారికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున 26 కోట్లా 15 లక్షల 40 వేల రూపాయలు వారి వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు.



అటకెక్కిన కాల్వల శుద్ధి

- మురుగు కేంద్రాలుగా కాల్వలు
- దిగువకు కలుషిత నీరే సరఫరా
- ప్లాంట్ల నిర్మాణంలో నిర్లక్ష్యం





ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో గుండా ప్రవహిస్తున్న మూడు ప్రధాన కాల్వలతోపాటు బుడమేరును శుద్ధి చేసే కార్యక్రమం ఈ ఏడాది కూడా ప్రశ్నార్ధకంగా మారింది. ప్రకాశం బ్యారేజి నుంచి బందరు, ఏలూరు, రైవస్ కాల్వలకు త్వరలో సాగునీటిని విడుదల చేయనున్నట్లు జల వనరుల శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో కాల్వల శుద్ధి ఈసారీ అటకెక్కినట్లేననే విమర్శలు వస్తున్నాయి. ప్రతి ఏడాది ఇదో ప్రహసనంగా మారింది. కాల్వల్లో టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర వ్యర్థాల తొలగింపు, శుభ్రతకు నగరపాలక సంస్థ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సంయుక్తంగా బాధ్యత తీసుకుంటున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నారు. కానీ మచ్చుకైనా ఈ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. బుడమేరు వాగులో ఏడాది పొడవునా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ఎండాకాలంలో కాల్వల్లో నీరు ఎండిపోవడంతో పెద్ద పెద్ద మురుగు కాల్వల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యర్థాలు కుళ్లి కాలుష్యం వెదజల్లుతున్నాయి. మరోవైపు సుమారు అర టిఎంసికి పైగా మురుగునీరు ఈ కాల్వల్లో చేరుతున్నట్లు అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది కాల్వలను శుద్ధి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. శుద్ధి కార్యక్రమం మొక్కుబడి సాగుతోంది. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండడంతో చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్వల్లో వేయనీయకుండా కాల్వలపై ఉన్న వంతెనలకు రెండు వైపులా ఇనుప మెస్‌లు ఏర్పాటు చేశారు. ఏలూరు లాకుల వద్ద భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను కొంత వరకు తొలగించారు. బుడమేరులో కూడా గుర్రపుడెక్క, తూటుకాడను మొక్కుబడిగా తొలగించారు. కాల్వలను పరిశుభ్రంగా ఉండాలని వంతెనల వద్ద మైక్ ప్రచారం ఏర్పాటు చేశారు. వీటితోనే సరిపెట్టడంతో కాల్వల్లో భారీగా చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కాల్వల్లో వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో అది దుర్వాసనకు కేంద్రాలుగా మారుతున్నాయి. మురికికూపాలుగా తయారవుతున్నాయి. దోమల ఉధృతికి కారణమవుతున్నాయి. దీంతో కాల్వల పరిసర ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దోమకాటుకు గురై మలేరియా, ఇతర విషజ్వరాల బారిన పడుతున్నారు. మరోవైపు మురుగుతో నిండిన కాల్వల ద్వారానే ప్రకాశం బ్యారేజి నుంచి నీటిని విడుదల చేసి ఉమ్మడి కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లాల ప్రజలకు తాగునీటిని, పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. తూర్పు కెనాల్ ద్వారా మంచినీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటినే 450 మంచినీటి ట్యాంక్‌లు, చెరువులకు నింపుతారు. సుమారు ఒక టిఎంసి నీటిని మంచినీటి అవసరాలకు కాల్వల ద్వారా వదులుతున్నారు. అయితే కాల్వల్లో వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించకపోడం, నగరంలోని మురుగునీరు వాటిలో కలవడంతో కలుషిత నీటినే తాగునీటి అవసరాలకు దిగువన ఉన్న లక్షలాది మంది ప్రజలు వినియోగించాల్సి వస్తోంది. శుద్ధిచేయని నీటినే చెరువులకు, ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. నగర పరిధిలో మురుగునీరు కాల్వల్లో కలవకుండా ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా శుద్ధి చేయవచ్చు. ఈ నీటిని పార్కులు, ఉద్యానవనాలు, ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఇటువంటి ప్రత్యామ్నాయ వనరులు, మార్గాలను చేపట్టాల్సిన విజయవాడ నగర పాలక సంస్థ ఆదిశగా చర్యలు తీసుకోవడంలో మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్‌టిపి)ను ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రజల నుంచి, ఇరిగేషన్ శాఖ నుంచి విఎంసిపై వత్తిడి వస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రామలింగేశ్వర్‌నగర్, ఆటోనగర్, సింగ్‌నగర్, జక్కంపూడి ప్రాంతాల్లో దెబ్బతిన్న ఎస్‌టిపిలను అమృత్ స్కీమ్ కింద పున:నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే ఆటోనగర్, రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో కొత్తగా రెండు ఎస్‌టిపిలు రూ.120 కోట్లతో ఏర్పాటు చేయాల్సి ఉంది. స్థలాభావం, నిధుల కొరత, పూర్తి చేయాలనే చిత్తశుద్ధి లేకపోవడంతో వీటి నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం ఉధృతం

కండ్రికలో పర్యటించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బాబూరావు, పలువురు నేతలు శనివారం ప్రచారం నిర్వహించారు. కండ్రిక కాలనీలో పర్యటించి స్మార్ట్ మీటర్లపై ప్రజలను చైతన్యపరిచారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సమావేశాలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉమ్మడిగా స్మార్ట్ మీటర్లను అడ్డుకోవటానికి స్థానికులు నిర్ణయించుకున్నారు. స్థానికులు, సిపిఎం నేతలతో కలిసిన స్మార్ట్ మీటర్‌ను అడ్డుకున్న వృద్ధురాలు రాజ్యలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ విషయంలో కూటమి ప్రభుత్వం తొలి అడుగులోనే తప్పటడుగు వేసిందన్నారు. వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందన్నారు. ప్రతి ఇంట్లో అదానీ దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు ఒప్పందాలు చేసుకుందని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టి భారీ కుంభకోణానికి పాల్పడిందని అన్నారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన టిడిపి కూటమి నేతలే నేడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వటం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగించడం నమ్మకద్రోహమే అవుతుందన్నారు. ప్రభుత్వ చర్యలను ప్రజలు ఎక్కడికక్కడ చైతన్యవంతులై అడ్డుకుంటున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాగ్రహాన్ని గమనించి ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం నిలిపివేయాలని, అదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని, ఇప్పటికే షాపులకు, చిన్న పరిశ్రమలకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాందోళన తీవ్రమవుతుందని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నాయకులు ఝాన్సీ, వెంకటరెడ్డి, పీర్ సాహెబ్, సావిత్రి, పిచ్చమ్మ, సుందరరామరాజు తదితరులు పాల్గొన్నారు.



కండ్రిక కాలనీలో వృద్ధురాలు రాజ్యలక్ష్మి గృహం స్మార్ట్ మీటర్‌ను అదాని సిబ్బంది తొలగించిన విషయాన్ని తెలుసుకుంటున్న సిహెచ్.బాబూరావు

2574 కేంద్రాల్లో యోగాపై అవగాహన

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో గల సచివాలయాలన్నింటిలోనూ ప్రతి సచివాలయానికి 9 కేంద్రాలలో యోగ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానఇన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దే తరుణంలో యోగాంధ్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగ పై అవగాహన కల్పిస్తున్న సందర్భంగా, ప్రతి సచివాలయంలో 9 కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాలలో ప్రజలకు యోగ పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ విజయవాడ నగరపాలక సంస్థలో గల 286 సచివాలయాల్లో 2574 కేంద్రాలలో యోగా డెమోన్స్ట్రేషన్ నిర్వహించారని కమిషనర్ తెలిపారు. ప్రజలతో యోగా చేపిస్తూ యోగ వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పిస్తూ ప్రజలను ఆరోగ్యవంతంగా చేయించటమే యోగాంధ్ర కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ముఖ్యంగా ప్రతి డివిజన్ లో గల స్పెషల్ ఆఫీసర్లు వారి పరిధిలో గల సచివాలయాల్లోని యోగా కేంద్రాలలో యోగాంధ్ర కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించారని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని సచివాలయాల్లో ఉన్న ప్రతి కేంద్రంలో ప్రజలకు యోగాంధ్ర కార్యక్రమం ద్వారా కల్పించే అవగాహన కార్యక్రమాలు తెలియపరిచామని పేర్కొన్నారు.



ఆపరేషన్ బుడమేరు చేపట్టాలి

నిరసన దీక్షలో సిపిఐ నేతల డిమాండ్

విజయవాడ : విజయవాడ నగరం, దిగువ ప్రాంతాల్లో పెను విషాదానికి కారణమైన బుడమేరు పనులను యుద్ధప్రాతిపదిక చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎటువంటి నష్టం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. విజయవాడ ధర్నా చౌక్‌లో శనివారం సీపీఐ ఎన్టీఆర్, కష్ణాజిల్లాల ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి అధ్యక్షతన బుడమేర ప్రక్షాలన చేయాలని, ఆక్రమణ తొలగించాలని నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం బుడమేరు వరద ఉధృతికి పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందేనన్నారు. ముంపు సమయంలో సీఎం చంద్రబాబు బుల్డోజరుపై ప్రయాణించి ప్రజలకు పలు హామీలు ఇవ్వటం జరింగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో బుడమేరుతో ఇలాంటి విపత్తులు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, సమస్యకు శాశ్వత పరిష్కారాం చూపిస్తానని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్న పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నేడు తాత్కలికంగా కేవలం గండ్లు పుడిక పనులు జరగడంతో సమస్య పరిష్కారం కాదన్నారు. విజయవాడ నుంచి కోల్లేరు, కోల్లేరు నుంచి సముద్రం కలిసేవరకు దాదాపుగా 160 కిలోమీటర్ల సుదీర్ఘమైన బుడమేరును అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి వరదలు వచ్చినా విజయవాడ నగరంతో పాటు పలు ప్రాంతాలు నష్టపోకుండా సుమారు రూ.1000కోట్లతో అభివద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ దీర్ఘ కాలంగా ఉన్న బుడమేరు సమస్య ఎన్టీఆర్,కష్ణా, ఏలూరు జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింతోందన్నారు. ఇప్పటి వరకు బుడమేరును ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదష్టకరమన్నారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రధానంగా 50 లక్షల కూస్కెక్కులతో ప్రవహించే బుడమేరు మూడు జిల్లాలను అతలాకుతలం చేసే పరిస్థితి ఉందన్నారు. నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు ప్రమాదాలు సంబవించినప్పుడు కేవలం నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు బుడమేరు వరదతో దిగువ ప్రాంతాలు ఎంతో నష్టపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

నీట్లో శ్రీ గోసలైట్స్‌కు జాతీయ ర్యాంకులు

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నీట్ –2025 ఫలితాల్లో విజయవాడ శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలతో మరో ఏడాది చరిత్ర సష్టించారని చైర్మన్ నరేంద్ర బాబు తెలిపారు. నీట్– 2025 పరీక్ష కఠినంగా ఉన్నప్పటికీ, పరీక్షా విధానం మారినప్పటికీ, నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రోగ్రామ్స్ డిజైన్ చేసి, నిజాయితీగా ప్రయత్నం చేయడం ద్వారా, ఫలితాల్లో ఎలాంటి మార్పులు ఉండవని, పైగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని శ్రీ గోసలైట్స్ నిరూపించిందని అన్నారు. నీట్–2025 ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిని, తల్లిదండ్రులను పేరుపేరునా అభినందిస్తున్నామని చెప్పారు. ఇందుకు కషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. నీట్ 2025 ఫలితాల్లో విజయవాడ శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు తాడిగడప వంద అడుగుల రోడ్‌లోని కెఎంవి ఇవాన్ క్లబ్‌హౌస్‌లో శనివారం సాయంత్రం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అకాడెమీ చైర్మన నరేంద్ర బాబు విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో మెడల్స్, జ్ఞాపికలు, నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా నరేంద్ర బాబు మాట్లాడుతూ నీట్– 2025 ఫలితాల్లో 720 మార్కులకు 600 పైన మార్కులు 11 మంది, 550 పైన మార్కులు 69 మంది, 500 పైన మార్కులు 379 మంది, 470 పైన మార్కులు 814 మంది, 450 పైన మార్కులు 1,086 మంది సాధించారని తెలిపారు. నీట్–2024 కటాఫ్ ప్రకారం, నీట్ 2025 ఫలితాలను అంచనా వేయగా, సుమారుగా 1,500 మందికి పైగా శ్రీ గోసలైట్స్ విద్యార్థులు దేశ వ్యాప్తంగా 'ఫ్రీ మెడికల్ సీట్లు' సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తుందన్నారు. శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ నుండి నీట్–2025లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులందరూ టెక్నో స్కూల్స్ నుండి కానీ, ఒలింపియాడ్ స్కూల్స్ నుండి కానీ కాకుండా, కేవలం సాధారణ స్కూల్స్ లో చదివిన సామాన్య విద్యార్థులు అలాంటి సామాన్య విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడంలో శ్రీ గోసలైట్స్ కి మించిన సంస్థ మరొకటి లేదని చెప్పారు. నీట్ పరీక్ష ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు, తెలుగు రాష్ట్రాల్లో లాంగ్ టర్మ్ కోచింగ్ ద్వారా 700 పైబడి మార్కులు సాధించిన మొట్టమొదటి విద్యాసంస్థగా శ్రీ గోసలైట్స్ చరిత్ర సష్టించిందన్నారు. ఈ మార్కులు సాధించడంలో విజయవాడలో అందరి కంటే ఎక్కువగా శ్రీ గోసలైట్స్ కి మాత్రమే సాధ్యపడిందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేంద్ర బాబు

ప్రమాదకర వైర్లు తొలగించండి : విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి – విజయవాడ : కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి వారం రోజుల్లోగా తొలగించాలన్నారు. ప్రజల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ, నగర సుందరీకరణలో భాగంగా అవసరం లేని వాడని కేబుల్ ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. వాడని వైర్లను క్రమబద్ధీకరించి, వారం రోజుల్లోగా తొలగించాలన్నారు.

నీట్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ

100 లోపు ఐదు ర్యాంకులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నీట్ 2025 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యా సంస్థల విజయవాడ విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరచి ర్యాంకులు సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీ కష్ణ తెలిపారు. నగరంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా కేటగిరీ నందు 10 లోపు ఐదు ర్యాంకులు సాధించారని తెలిపారు. 1,5,6,8,10 ర్యాంకులు సాధించారని అన్నారు శ్రీ చైతన్య విజయవాడ విద్యార్థులు ఆల్ కేటగిరీలో 100 లోపు ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారని అన్నారు. బి.ధీరజ్ కుమార్ 8వ ర్యాంకు, పి.అవినాష్ 15 వ ర్యాంకు, టి.శివ మణిదీప్ 24 వ ర్యాంకు, త్రివిక్రమ్ 57వ ర్యాంకు, బి.కుముద 61 వ ర్యాంకు, శశి కిరణ్ 98 వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఆలిండియా కేటగిరీ 1000లోపు 26 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. విజయవాడ నుంచి 1600 మంది విద్యార్థులు మెడికల్ సీటు సాధించే విధమైన ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపక బందం అభినందించారు.

కనబడుట లేదు



పేరు : రామకూరి.లూర్థు మరియన్న,
వయస్సు : 66సం
ఎత్తు : 5.4 రంగు : చామనచాయ
పనిచేసిన శాఖ : ఫీల్డ్ మెన్(Rtd), మత్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయం, బంటుమిల్లి

2022 ఫిబ్రవరిలో ఇంటి నుండి బయటకి వెళ్లి మరల తిరిగి రాలేదు. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

**చిరునామా: డోర్ నెం. 14-179,
పంబలగూడెం, బైపాస్ రోడ్డు,
మచిలీపట్నం. సెల్ నెం. 9014873746**

17న పాలస్తీనా సంఘీభావ దినం

ప్రజాశక్తి - విజయవాడ : ఇస్కఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖలలో ఈనెల 17న పాలస్తీనా సంఘీభావ దినోత్సవం జరపాలని ఇస్కఫ్ అధ్యక్షులు కాగితాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎన్ నరసింహులు, తుంగ శ్రీధర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం వి మాధవరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. వారు విడుదల చేసిన ప్రకటన ఇలా ఉంది. గాజాలో ప్యాలస్తీన్ ప్రజలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం జరుపుతున్న యుద్ధాన్ని ఇస్కఫ్ తీవ్రంగా ఖండిస్తుంది. ఇరవై మాసాలుగా ఇజ్రాయెల్ జరిపిన బాంబుల దాడులు మరియు మిలటరీ దాడుల్లో 55,000 మందికి పైగా ప్యాలస్తీనియన్లు హతమయ్యారువారిలో చాలా మంది మహిళలు మరియు పిల్లలు. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థ శిబిరాలు వంటి మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేశారు. గాజాలో ప్రజలను మానవీయ విపత్తులోకి నెట్టివేయడం జెనోసైడ్ కాకపోతే మరేంటి? గాజాకు సహాయ సామాగ్రి రాకుండా అడ్డుకుంటున్నారు. అంతర్జాతీయ జలాల్లో జరిగిన ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కు చెందిన మాడ్లీన్ అనే మానవతా నౌకపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని ఇస్కఫ్ తీవ్రంగా ఖండిస్తున్నది. భారత్ ప్రభుత్వం మౌనంగా ఉండకుండా, విదేశీ వాలంటీర్ల విడుదల కోసం చర్యలు తీసుకోవాలనీ కోరుతున్నది. మానవతా సహాయాన్ని ఖచ్చితంగా అనుమతించాలి ఈ అమానవీయ చర్యలకు అంతం పలకాలి. ఇజ్రాయెల్ పాలనపై అంతర్జాతీయ ఆగ్రహం పెరుగుతోంది, ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం సహా అనేక సంస్థలు గళమెత్తుతున్నాయి. అయినా అమెరికా మరియు కొంతమంది మిత్రదేశాల మద్ధతుతో నెతన్యాహూ ప్రభుత్వం దయారహితంగా దాడులు కొనసాగిస్తోంది.

జనరల్ బోగీల సంఖ్య పెంచాలి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం నుండి ఇతర సుదూర ప్రాంతా లకు ప్రయాణించే ప్రయాణికులు సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని, మచిలీ పట్నం నుండి హైదరాబాదు వెళ్లే ఎక్స్ప్రెస్ రైలులో తగ్గించిన జనరల్ బోగీల సంఖ్య వెంటనే పెంచాలని సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూరసుబ్రహ్మణ్యం రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టారునకు హైదరాబాదు ఎక్స్ప్రెస్ నకు బోగీల సంఖ్య పెంచాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మచిలీపట్నం నుండి హైదరాబాదు వెళ్లే ట్రైన్ నెంబర్ 12749 /12750 ఎక్స్ప్రెస్ నకు ముందు భాగంలో రెండు వెనుక భాగంలో రెండు గతంలో జనరల్ బోగీలు ఉండేవని అలాగే మహిళల కొరకు ఒకటి వికలాంగుల కొరకు ఒక బోగి చొప్పున ఉండేవన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు ఆసౌకర్యంగా లేకుండా జనరల్ బోగీలు పెంచాల్సిందిపోయి తగ్గించడం దురదష్టకరమని అన్నారు. గతంలో ఉన్న నాలుగు జనరల్ బోగీలను ప్రస్తుతం రెండుగా తగ్గించడం వలన నిరుపేద ప్రయాణికులు, గర్భిణీలు, చిన్నపిల్లలు వద్దులు, అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంటోందని,కావున మచిలీపట్నం నుండి హైదరాబాదు వెళ్లే ఎక్స్ప్రెస్ రైలునకు జనరల్ బోగీల సంఖ్య వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా మచిలీపట్నం రైల్వే స్టేషన్ ఒక ప్లాట్ఫారం నుంచి మరొక ప్లాట్ఫారం వెళ్లే సందర్భంలో వద్దులు, పిల్లలుమరి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి ఎస్కలేటరు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మచిలీపట్నం నుండి సికింద్రా బాద్కు ఉదయం వేళలో మరొక ట్రైన్ నడపాలని ఆయన రైల్వే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొడాలి శర్మ, నగర కమిటీ సభ్యులు సిహెచ్. జయ రావు, టి చంద్రపాల్, రావి వెంకట్రావు, డి సత్యనా రాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సీజ్ చేసిన ట్రాక్టర్లు

అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-కోడూరు : అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక జెసిబి, మూడు ట్రాక్టర్ను సీజ్ చేశామని విశ్వనాధపల్లి వీఆర్ఓ హరిబాబు తెలిపారు. మండల పరిధిలోని విశ్వనా థపల్లి సాలెంపాలెం గ్రామాల మధ్య అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని విశ్వనాథపల్లి వీఆర్వో కమ్మిలి హరిబాబుకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి ఒక జెసిబి, మూడు ట్రాక్టర్లు పట్టుకుని సీజ్ చేసి 19 వేలు జరిమానా విధించామన్నారు.

భార్యాపిల్లలు కనిపించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : భార్య ముగ్గురు కుమార్తెలు కనిపించడం లేదని ఒక భర్త గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన రాజు తన భార్య, ముగ్గురు ఆడపిల్లలు కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9వ తేదీ నుంచి వారు కనపడడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్లో తెలపాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలి

ప్రజాశక్తి-మొవ్వ : సిపిఎం మొవ్వ శాఖా సమావేశం శనివారం మొవ్వలో చిగురుపల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం జరిగింది. మొవ్వ జగనన్న కాలనీ, పెదపూడి జగనన్న కాలనీలోని మౌలిక సదుపాయాలు సరిచేయాలని, మొవ్వ కోర్టు సెంటర్ నుంచి అయ్యంకి ఆంజనేయ స్వామి గుడి వరకు ప్రధాన రహదారి మరమ్మత్తులు, మొవ్వ బస్టాండ్ సెంటర్లో గోతులు మయంగా ఉన్న రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పెదపూడి దళితపేటలో శ్మశానానికి వెళ్లే రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, పార్టీ మొవ్వ శాఖ సభ్యురాలు చేబ్రోలు బసవపూర్ణ, శాఖా కార్యదర్శి కాకి రాజశేఖర్, శాఖ సభ్యులు తప్పేట లాజర్ పాల్గొన్నారు.

తల్లికి వందనంపై అసత్య ప్రచారాలు తగదు



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తల్లికి వందనం' అమలుపై కూటమి ప్రభుత్వం మాట నిల బెట్టుకుందని, కానీ వైకాపా నాయకులు, బులుగు మీడియా చేస్తున్న అసత్య ప్రచారం బాధాకరమని, ఆధారల్లేని ఆరోపణలు చేస్తే సహించబోమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి హితవు పలికారు. వైకాపా నాయకుల ఆరోపణలను వీరంకి శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు రూ.15 వేలు చొప్పున ఆయా తల్లుల ఖాతాల్లో జమచేస్తామన్న మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. మంత్రి లోకేష్ పై తప్పుడు ఆరోపణలు చేయవద్దని, దమ్ముంటే రుజువు చేయాలని వీరంకి సవాల్ విసిరారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాదు కార్యాలయం వద్ద 11వ విడత 21 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో 21 మంది లబ్ధిదారులకు రూ 38 లక్షల 92 వేల 386 లను చెక్కుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ పది విడతల్లో 334 మందికి రూ రెండు కోట్ల 25 లక్షల 37వేల 424 లు ఆర్థిక సహాయం అందజేసినట్లు చెప్పారు.

వివేకవర్ధినికి ఘన నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ప్రముఖ కథ, నవల రచయిత నందం రామారావు సతీమణి వివేకవర్ధిని తృతీయ వర్ధంతిని 10వ డివిజన్ సుకర్లాబాదులో ఉన్న స్నేహాలయ వద్ధాశ్రమంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందం రామారావుతో పాటు ఆయన కుమారుడు దూరదర్శన్ చీఫ్ కెమెరామెన్ నందం శ్రీనివాస్, కుమారి పద్మవతి పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు



ప్రిన్సిపాల్ వి.వి కృష్ణమోహన్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని దావాజీగూడెంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం పాలీసెట్ కౌన్సిలింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.వి కృష్ణమోహన్ శనివారం తెలిపారు. ఈనెల 21 వ తేదీ నుంచి మొదలకానున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ఇక్కడ కౌన్సిలింగ్ సెంటర్ లో పెట్టు కోవచ్చు అన్నారు. గతంలో విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఈ వెరిఫికేషన్ కార్యక్రమం జరిగేదనీ, ఈ సంవత్సరం వాటితో పాటు గన్నవరం గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ లో కూడా ఈ సంవత్సరం నుంచి కౌన్సిలింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశామని, ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియో గించుకోవాలన్నారు. గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఉన్నటువంటి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలతో పాటు, రాష్ట్రంలో ఉన్నటు వంటి 82 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశా లలో, ప్రైవేటు పాలిటెక్నిక్ లలో ప్రవేశాల కొరకు పాలిసెట్ పరీక్ష ఉత్తీర్ణులైనటువంటి విద్యార్థుల కోసం ఈ కౌన్సిలింగ్ ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వి. ఎలీషా మాట్లా డుతూ గత కొన్ని సంవత్సరాలుగా పాలిటెక్నిక్ విద్యార్థులకు 90 శాతం ప్లేస్మెంట్ లభిస్తుందని, అందువలన సాంకేతిక విద్యను, ప్రత్యేకంగా బ్రాంచ్ లకు విశేష ఆదరణ లభిస్తుందని తెలిపారు.

బ్యాంకు ఖాతాకు ఎన్పిసిఐ అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : తల్లికి వందనవం పథకం కింద కొంతమంది విద్యార్థులకు ఎన్పిసిఐ అనుసంధానం కాలేదు కాబట్టి ఆ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమ కాలేదని జిల్లా షెడ్యూల్డ్ కులాల సాధికారత అధికారి, ఎస్ కె షాహిద్ బాబు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ నిధులు మంజూరు కాని విద్యార్థులు బ్యాంకు అకౌంట్ లేదా పోస్టల్ ఖాతాలకు ఆధార్ నెంబర్ ను (ఎన్ పి సి ఐ) అనుసంధానవం చేసుకోవాలన్నారు.

నగదు పడనివారు దగ్గరలో ఉన్న మీ గ్రామ, వార్డ్ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డ్ ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని, బ్యాంకు వారిని లేదా పోస్ట్ ఆఫీస్ వారిని సంప్రదించి ఎన్ పి సి ఐ అనుసంధానవం చేసుకోవాలన్నారు. దీనిపై ఈ నెల 14, 16 తేదీన స్పెషల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పలుచోట్ల రక్తదాన శిబిరాలు



గుడ్లవల్లేరు మండలంలో...

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రక్తదానం గొప్ప మానవతా సేవా అని జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖర రావు అన్నారు. స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాటికల్ సైన్సెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐపీఎ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె చంద్రశేఖర రావు మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని, ప్రతి విద్యార్థి మంచి చెడులను గమనిస్తూ మంచి మార్గాన్ని అనుసరించి సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.రక్తదానం ప్రాణదాన మన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు తరచూ రక్తదానం, సేవా కార్యక్రమాలు డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర కార్యక్రమాలు సంయుక్త నిర్వహణ కొరకు కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ తో అవగాహన ఒప్పందం చేసుకున్నా రన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్ నాథ్ రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కు ఆర్డినేటర్ నాగుల్ మీరావలి, కళాశాల సిబ్బంది, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడులోని శ్రీ లక్ష్మీ హాస్పటల్లో డాక్టర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకులు, ఏర్పోర్ట్ అథారిటీ మెంబర్ ముప్పా రాజా పాల్గొని రక్తదానం చేశారు. వీరితోపాటు జనసేన నాయకులు పచ్చిపాల శేఖర్, సతీష్, భాషా, చందు, కిషోర్, రంజిత్ రక్తదానం చేశారు.ప్రజాశక్తి - గుడివాడ : రక్తదాతల దినోత్సవం సందర్భంగా న్యాయవాది లాయర్ హేమంత్ రక్తదానం చేశారు. శనివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో 11వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చి చూస్తే రక్తదాతలు పెరిగారని, రానున్న రోజుల్లో ఇంకా ప్రజలు ముందుకు రావాలన్నారు.



గుడివాడలో...



కంకిపాడులో...



మాట్లాడుతున్న పిల్లి నరసింహారావు

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహాసభ ఆహ్వాన కమిటీ ఏర్పాటు

విజయవాడ : బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా పదో మహాసభ నేపథ్యంలో శనివారం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 30న రామవర్పపాడులో నిర్వహిస్తున్న నేపథ్యంలో రామవరప్పాడు సాయిబాబు గుడి వెనుక కట్టపరాజా కాంప్లెక్స్‌లో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి.అప్పారావు అధ్యక్షత వహించారు. నరసింహారావు మాట్లాడుతూ భవనర్మాణ కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డుని గత ప్రభుత్వం పనిచేయకుండా ఆపేసిందని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏడాది అవుతున్నా నెరవేర్చలేదని అన్నారు. మహాసభల్లో సంక్షేమ బోర్డు పనిచేయడం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ చర్చించి భవిష్యత్తు ఆచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బి.గోవిందు, బెనర్జీ, ఎం.సోమేశ్వరావు, బాబురావు బుచ్చిబాబు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘానికి అధ్యక్షులుగా ఇ.అప్పారావు ప్రధాన కార్యదర్శిగా పోలాకి.కృష్ణ,కోశాధికారిగా గోవిందు, కనకారావు, చిత్ర శీను, శేషు, కృష్ణమూర్తి,పి.గంగరాజు ఎం.సత్యనారాయణ, తదితరులతో కలిపి సంఘాన్ని ఏర్పాటు చేశారు.

చిన్నారుల అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - మైలవరం :

మైలవరంలో అనుమానాస్పదంగా మృతి చెందిన చిన్నారులు లక్ష్మీ హిరణ్య, లీలా సాయిల అంత్యక్రియలు హిందూ స్మశాన వాటిక సమీపంలో శనివారం పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల క్రితం మైలవరంలోని మారుతి నగర్‌లో చిన్నారులు ఇద్దరు అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారుల మృతదేహాలు డి కంపోజ్ అవ్వడంతో మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించటం కష్టమని వైద్యులు తెలపడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు. పోస్టుమార్టం అనంతరం మైలవరం తరలించిన చిన్నారుల మృతదేహాలకు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. చివరిసారిగా చిన్నారుల తండ్రి రవిశంకర్ ఫోన్ సిగ్నల్స్ ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద చూపించడంతో పోలీసులు రవిశంకర్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రవిశంకర్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎక్కడికైనా పారిపోయాడ అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

బిసిలకు తల్లికి వందనం హర్షణీయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :

తల్లికి వందనం పథకంలో 29.82.900 మంది బిసి విద్యార్థులు ఎంపికకావడం హర్షణీయమని టిడిపి బిసి సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మిన కోటేశ్వరరావు అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందన పథకానికి రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు లబ్ధి చేకూరిందని ఆయన అన్నారు. తల్లుల తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి పథకాల ద్వారా బీసీ విద్యార్థులు విద్యావంతులై ఆర్థికంగా నిలబడతారని అన్నారు. చేయూత అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



బోధనలో మెళకువలు అవసరం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కాలానుగుణమైన సాంకేతిక అంశాలు, మారుతున్న సమాజ అవసరాలు, విద్యార్థుల అభిరుచులు, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనను తీర్చిదిద్దుకోవాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ వి.సుభాషిణి సూచించారు. కెబిఎన్ కళాశాల ఐ.క్యు.ఎ.సి విభాగం ఆధ్వర్యాన శనివారం అధ్యాపక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ అధ్యాపకులు విషయ నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, దేశభక్తి తదతర అంశాలకు కూడా స్థానం కల్పించాలన్నారు. నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతమైన మార్గదర్శనం చేసే సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా, మానవీయ విలువలను బోధించే నేతలుగా, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా ఎలా నిలవాలో పలు అంశాల ఆధారంగా స్పష్టంగా వివరించారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుభాషిణి

ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపక వత్తి సమాజంలో అన్నివత్తులకన్నా గౌరవప్రదమైనదన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌గా వెంకట కృష్ణారావు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పురపాలక సంఘ కమిష నర్‌గా డి.తులసి వెంకట కృష్ణారావు శనివారం బాధ్య తలు చేపట్టారు. తులసి వెంకట కృష్ణారావు ఇప్పటి వరకు సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్‌గా చేసిన రామ్మోహన్ రావు గత నెలలో బదిలీ అయిన సంగతి విధితమే.



గుడి అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని నాగులూరు గ్రామంలోలి బిసి కాలని మెయిన్ రోడ్డులో గల శ్రీఆంజనేయస్వామి గుడికి నాగులూరు రామారావుబాబు ప్రోత్సాహంతో వారి తమ్ముడు కలకొండ వంశీబాబు ధర్మాపత్ని కలకొండ కృష్ణప్రియద్వారా గుడిఆవరణలో 65 వేల రూపాయలు సొంత ఖర్చులతో రేకులు, టైల్స్‌ను వేయించారు. కాలనీ పెద్దలు తన్నీరు ఎల్లయ్య, బెజవాడ చంటి, రామారావుబాబు పాల్గొని పనులు పర్యవేక్షించారు.

ఎల్‌బిఆర్‌సిఇలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కె.వి.రమణ రెక్టార్ జెఎన్‌టియు కాకినాడ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కోర్సు చదివిన దానిలో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కృషి పట్టుదలతో ఆయా రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. గౌరవ అతిథి సుప్రియ దేవ దుత్త మాట్లాడుతూ వ్యవస్థాపకత వ్యాపారం సాంకేతిక ఆవిష్కరణలను అనుసరించాలని అన్నారు. కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వివిధ కోర్సులకు సంబంధించి 847 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారని వీరిలో 9 మందికి గోల్డ్ మెడల్స్, 10 మందికి సిల్వర్ మెడల్స్, సాధించారన్నారు. కళాశాల టాపర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థిని ఎ.అనితకు లక్కిరెడ్డి బాల్‌రెడ్డి గోల్డ్ మెడల్‌తో పాటు 25 వేలు నగదు బహుమతిని అందజేశారు. కళాశాల వైస్ చైర్మన్ లక్కిరెడ్డి ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల యోగా కార్యక్రమాలు

- కొండపల్లి ఖిల్లాపై అద్భుతంగా సాగిన యోగాంధ్ర
- పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జెసి ఇలక్కియ



కొండపల్లి ఖిల్లా వద్ద యోగాలో పాల్గొన్న కలెక్టర్, జెసి, తదితరులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండపల్లి ఖిల్లాపై ప్రకృతి రమణీయత మధ్య యోగా సాధకుల యోగా సాధన అద్భుతంగా సాగింది. యోగాసనాల శ్వాస లయలతో కొండపల్లి ఖిల్లా పులకించింది. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సారథ్యంలో శనివారం కొండపల్లి కోటపై ప్రత్యేక యోగాసనాల అభ్యసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎపిఎన్‌జిజిఒ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, వందలాది స్థానికులు, ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా మే 21 నుంచి పండగలా ప్రతి గ్రామం, పట్టణంలో యోగా సాధన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే గాంధీ హిల్, పవిత్ర సంగమం, హరిత బెరం పార్కులో కార్యక్రమాలు నిర్వహించామని, శనివారం హరిత శోభకు, చారిత్రక ఔన్నత్యానికి నిలువుటద్దంగా ఉన్న కొండపల్లి ఖిల్లాపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మన చారిత్రక వారసత్వ సంపద అయిన యోగా విశ్వవ్యాప్తమైందని, బిపి, మధుమేహం, హార్మోన్ల అసమతుల్యం వంటి జీవనశైలి అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు యోగా రామబాణం అని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు నిరాంటంకంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ యోగాసనాల ఆచరణకు రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ప్రపంచానికి మన దేశం ఇచ్చిన గొప్ప కానుక యోగా అని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉన్న కొండపల్లి ఖిల్లాపై జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

అలరించిన కళాత్మక, సందేశాత్మక సాంస్కతిక కార్యక్రమాలు

కొండపల్లి ఖిల్లాపై జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంతో సాగిన కళాత్మక ప్రదర్శన ప్రేక్షకుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది. మన వీర సైనికుల పోరాట పటిమ, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను గుర్తుచేస్తూ సాగిన ప్రదర్శనపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ ప్రదర్శన యోగాంధ్ర విశిష్టతతో పాటు మనకు మనోధైర్యాన్నించిందని పేర్కొన్నారు. మన వీరసైనికుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. శిరీష యోగా అకాడమీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు యోగా ఔత్సాహికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డీవీ రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిటీ కార్యవర్గ సభ్యులు ఎన్జీవో నేతలు పాల్గొన్నారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ యోగా గురు సత్యనారాయణ, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్యకీర్తన, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డా. ఎన్‌టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డా. జె.సుమన్, ఆయుష్ అధికారులు డా. వి.రాణి, డా. రామత్లేహి, డా. రత్నప్రియదర్శిని పాల్గొన్నారు.

విస్సన్నపేట : జిల్లా అగ్ని మాపక అధికారి ఆదేశాల మేరకు శనివారం విస్సన్నపేట అగ్ని మాపక కేంద్రంలో సిబ్బంది యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి రోజు జిల్లా లోని అన్ని అగ్ని మాపక కేంద్రంలో యోగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారని జిల్లా అగ్ని మాపక అధికారి శ్రీ ఏ.వి.శంకర రావు, జాన్ అహ్మద్, ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: యోగేంద్ర మాస్ ర్యాలీ డిమాన్‌స్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ముక్త్యాల గ్రామంలో కృష్ణానది ఒడ్డున భారీ సంఖ్యలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ యోగ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, జగ్గయ్యపేట ఎంపిడిఒ జి.నితిన్, తహశీల్దార్ మనోహర్, పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ రామకృష్ణ ఇంకా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో గుర్తించిన అన్ని వెన్యూలలో యోగ అభ్యాసం జరుగుతుందన్నారు. అందరూ యోగాను అభ్యాసం చేస్తూ ఆరోగ్యం పొందాలని సూచించారు. యోగ వ్యాసం అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వీరులపాడు : మండలం జుజ్జూరు గ్రామంలో జల్లి ఏసోబు కళ్యాణ మండపంలో ప్రభుత్వ అధికారులు సర్పంచులు వీఆర్వోలతో కలిసి యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్య రక్షణకు ఒత్తిడి నివారణకు యోగ అనేక రకాల ఉపయోగపడుతుందన్నారు. యోగాను రోజువారీ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రమావత్ కోటి, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి పలువురు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం -జూన్ 21 పురస్కరించుకొని శనివారం హైస్కూల్‌లో యోగా సామూహిక ప్రదర్శన జరిగింది. ట్రైనర్, రెడ్డిగూడెం సచివాలయం-2 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ యోగాసనాలు చేయించడమైనది .ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల ఎంపీడీవో రమణ, రంగాపురం గ్రామంలో తహశీల్దార్ సుశీల దేవి, కుదప గ్రామంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ పాల్గొన్నారు. హైస్కూల్‌లో హెచ్‌ఎం ధర్మశీల, పంచాయతీ కార్యదర్శి రామారావు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ కుమారి, ఆశా వర్కర్లు, ఇతర గ్రామస్థాయి ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు

- నత్తనడకన డ్రెయినేజీ నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి-గన్నవరం : ఆర్ అండ్ బి అధికారుల పనితీరు నానాటికి దుర్భరంగా మారుతోంది. ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ, పక్కన డ్రెయినేజీలు నిర్మాణం చేసేందుకు ఆగమేఘాలపై మట్టి తవ్వకాలు చేశారు. అయితే పనులు దశా దిశ లేకుండా అస్తవ్యస్తంగా మారటంతో వ్యాపారు లతో పాటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం నుంచి ముస్లిం పేట జండా చెట్టు వరకు దాదాపు 500 మీటర్లకు రోడ్డుకు రెండు వైపులా రూ.50 లక్షలతో డ్రెయినేజీ, విస్తరణ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఈ పనులు. తలాతోక లేకుండా జరుగుతున్నాయి. జేసీబీలు. ప్రొక్లెయినర్లు తీసుకు వచ్చి హడావుడిగా డ్రెయినేజీ నిర్మాణం కోసం మట్టి తవ్వకాలు చేశారు. తవ్విన మట్టిని ఎక్కడికి తరలించారో అధి కారు లకే తెలియాలి.

ప్రమాదకరంగా తవ్వకాలు..


ఇది ఇలా ఉంటే డ్రెయినేజీల కోసం తవ్విన గుంతలు అత్యంత ప్రమాదంగా ఉన్నాయి. తవ్విన గుంతలకు ఆనుకునే దుకాణాలు ఉండటంతో వ్యాపారాలు, వినియోగదారులు దుకాణాలకు వెళ్లా లంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నత్తనడకన పనులు

డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గుంతలు తవ్వి నెల రోజులకు పైగా గడిచినా పనులు వేగంగా చేయటం లేదు. వర్షం పడటంతో తవ్విన మట్టితో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. రాత్రి సమయాల్లో ఆరడుగుల గుంతల్లో ఎవరైనా పడితే ప్రమాదం జరిగి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. డ్రెయినేజీ నిర్మాణ పనులు కూడా చేపట్ట లేదు. ఆర్ బ్యూఎస్ అధికారుల నిర్లక్ష్యమని అంటున్నారు.రహదారికి ఇరుపక్కల డ్రెయి నేజీ నిర్మాణ పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్య వేక్షణలో జరగాల్సి ఉంది. 50 అడుగుల వెడల్పుగా ఉన్న రోడ్డు పరిధి పూర్తిగా ఆర్ అండ్ బి పరిధిలోనే ఉంది. వాస్తవానికి డ్రెయినేజీ పనులు అధికారులు మాత్రమే గ్రౌండ్ చేయాలి. కానీ డ్రైనేజీ నిర్మాణ పనులు ఆర్ డబ్ల్యుఎస్ కి అప్పగించడంతో నత్త నడకన సాగు తున్నాయి. కాంట్రాక్టర్ కూడా ఈ పనులు చేయడానికి అంత ఆసక్తి చూడం లేదు. నిధులు వస్తాయా? రావా? అన్న అనుమానం కూడా ఉందని అంటున్నారు.

అంతా గందరగోళం..

ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్ శాఖలపనుల తీరు గందరగోళం గా మారింది. పాలకులు ఏమి చేస్తున్నారో ప్రజలకు అర్థంకావటం లేదని ప్రజలు విమ ర్శిస్తున్నారు. పంచాయితీ పరిధిలో తీవ్రంగా ఉన్న సమస్యలు గాలికి వదిలి, ప్రాధాన్యం లేని పనులు హడావుడిగా చేయటంపై ప్రజలు ఆక్షేపిస్తున్నారు.





యోగా సాధనతో ఆరోగ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా బచ్చుపేట వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం ఆవరణలో శనివారం యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా మాస్టర్లు ముదిగొండ శాస్త్రి, జి స్వర్ణ లత లు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ముక్తేవి రవికాంత్, లోగిశెట్టి వెంకటస్వామి, చిట్టి కుమారి, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎవి గోపాలరావు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న దృశ్యం

'తల్లికి వందనం' విప్లవాత్మక కార్యక్రమం : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం ఓ విప్లవాత్మక కార్యక్రమం అని ఈ కార్యక్రమం ద్వారా పేదరికం కారణంగా చదువుకు దూరం అయ్యే దుస్థితి నుంచి విముక్తి లభిస్తుందని టిడిపి నేత ఎన్నారై బో బ్బా తెలిపారు. శనివారం అవనిగడ్డలో పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో గోవర్ధన్ మాట్లాడారు. వైసిపి పాలనలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే తల్లికి వందనం వచ్చేదని, దీనితో పేదరికం కారణంగా మిగిలిన పిల్లలు బడికి దూరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 67.27 లక్షల మందికి ఈ పథకం అందిస్తున్నారని, ఇందుకోసం రూ 8745 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఇది వైసీపీ అధికారంలో ఇచ్చిన దానికంటే మూడు వేల కోట్లు ఎక్కువ అనే విషయాన్ని గమనించాలన్నారు. ప్రభుత్వం ప్రతి పేద విద్యార్థికి మంచి చదువు అందించాలనే చిత్తశుద్ధితో పనిచేస్తుంటే వైసీపీ మాత్రం ఇంకా ప్రజలను పక్కదారి పట్టించి మోసం చేసేలా వ్యవహరిస్తుందని గోవర్ధన్ ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా విద్యా శాఖలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతున్నారని, పాఠశాలల ప్రారంభం మొదటి రోజే పాఠ్యపుస్తకాలు బ్యాగులు పంపిణీ చేశారని అన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కూడా పూర్తిచేశావచ్చిందని, 9600 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నారని గోవర్ధన్ ప్రశంసించారు.



టిడిపి నేత, ఎన్నారై బోబ్బా గోవర్ధన్

డ్రైనేజీల్లో మురుగు తొలగింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి డ్రైన్లు నీట మునిగి మురికి నీరు నిలిచిపోయాయి. ప్రధాన బస్టాండ్ సెంటర్లోని మేజర్ డ్రైన్లో నిలిచిపోయిన మురుగని జెసిబి ద్వారా తొలగించి, మురికి నీటిని పంపించే కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు తెలిపారు. గ్రామంలో ఎక్కడ మురుగునీరు నిలచి ఉన్న వాటిని తొలగించి ఆ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించినట్లు ఆయన తెలిపారు. అలాగే గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రబలకొండ తగు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.






సామినేనితో బండి రామకృష్ణ భేటీ

ప్రజాశక్తి- మచిలీపట్నం అర్బన్ : ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయ భానును జగ్గయ్యపేటలో ఆయన నివాసంలో శనివారం మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మర్యాద పూర్వ కంగా కలిశారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర రాజకీ యాలపై, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల మాట్లాడుకున్నారు. వారితో పాటు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు పాల్గొన్నారు.

సూర్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పమిడిముక్కల : మండలంలోని కపిల ేశ్వరపురంకు చెందిన తాతినేని సూర్య నారాయణ మృతిపట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు శని వారం సంతాపం తెలిపారు. ఆయన గతంలో పాల కేంద్రంలో విధులు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులు తాతినేని సాయిదత్తు, తాతినేని కృష్ణ ఉన్నారు. సూర్యనారాయణ మృతిపట్ల టిడిపి నాయకులు, వ్యాపారవేత్త తదితరులు సంతాపం తెలిపారు.



మొవ్వ సిడిపిఒగా ప్రసన్న విశ్వనాథ్



ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓగా ఎస్. ప్రసన్న విశ్వనాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. మొవ్వ ప్రాజెక్టుకు ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాజెక్టు నుంచి బదిలీపై వచ్చారు. గత సంవత్సర కాలంకు పైగా ఇంచార్జి పాలనలో కొనసాగుతున్న ఈ ప్రాజెక్టుకు సిడిపిఓగా విచ్చేసిన ఈమెను సెక్టార్ సూపర్వైజర్స్ ఏనుగు పుణ్యవతి, ఏఎస్ కళ్యాణి, వి రత్నమాల, టి రమా నాగమణి, జె విశ్రాంతమ్మ, పి రాజరాజేశ్వరిలు అభినందించారు.

మంత్రి కొల్లు పిఎపై వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మంత్రి కొల్లు రవీంద్ర పీఏ టి.శివరామ ప్రసాద్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. గత మూడు రోజుల క్రితం పేర్ని నాని తన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర దగ్గర అధికారిక పీఏగా పని చేస్తున్న తోట శివరామకృష్ణపై మాజీ మంత్రి పేర్ని నాని నిరాధారమైన అవినీతి ఆరోపణలతో పాటు వ్యక్తిగత దూషణలు చేయడం గర్హనీయమని సంఘ బాధ్యులు పేర్కొన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటారని, నిబంధనల మేరకే నడుచుకుంటారన్నారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తారన్నారు. రాజకీయ నాయకులు ఉద్యోగులపై వ్యక్తిగత దూషణలు చేయడం సరి కాదన్నారు. పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను ఖండించిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, కార్యదర్శి ఎం శ్యామ్ నాథ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పేపేటి సత్యనారాయణ, డివి జన్ అసోసియేట్ అధ్యక్షులు టి శేఖర్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోన ఆంజనేయకుమార్ లు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ కేసరపల్లి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా ఆదివారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు కేసరపల్లి మొత్తం ఏరియా, కేసరపల్లి హౌసింగ్ కాలనీ, ఎస్ ఎల్ వి విల్లాస్, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధ వరం, బూతుమిల్లిపాడు, జక్కులనక్కలం హౌసింగ్ కాలనీ, వి.ఎన్. పురం కాలనీ, ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

- రోడ్డుపక్కన మట్టి జారుతున్నా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి-కోడూరు : ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం కోడూరు మండల ప్రజలకు తీరని శాపంలా మారింది. అవనిగడ్డ-కోడూరు రహదారి కృష్ణాపురం-కోడూరు, జయ పురం-కొత్తపాలెం గ్రామాల మధ్య 6 చోట్ల రహదారి పక్కనే ఉన్న మట్టి పంట కాలవలోకి జారి పోతుండడంతో ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్ బి-ఇరిగేషన్ అధికారులు సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో మండల ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు ఒకసారి నిర్మాణం చేపట్టిన తర్వాత మరల రోడ్డు నిర్మాణం చేయాలంటే 5 నుంచి 7 సంవత్సరాల పాటు వ్యవధి ఉంటుందని తెలిసి కూడా రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు రోడ్డు కొంతకాలం పాటైనా పదిలంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులకు లేదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే రోడ్డు జారిపోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా రాధిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా కొండపల్లికి చెందిన జనసేన నాయకురాలు చెరుకుమల్లి రాధిక నియమితులయ్యారు. కూటమి సర్దుబాటులో భాగంగా రాధికకు డైరెక్టర్ పోస్టు లభించింది. కొండపల్లి జనసేన పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్ సతీమణి చెరుకుమల్లి రాధిక గత మున్సిపల్ ఎన్నికల్లో 28వ వార్డు లో జనసేన పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి తమ వంతు కషి చేశారు. తమకు ఇచ్చిన బాధ్యతను నిర్వహించి రైతుల సమస్యలు తీర్చడానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా రాధిక తెలిపారు.



విజయవాడ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ మాజీ అధ్యక్షులు ఆవుటు రాజా సతీమణి ఆవుటీ సంతోషం ఎంపిక కావడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా గత ఎన్నికల్లో మెజారిటీ రావడానికి ఎంతో కృషి చేశారు. సర్పంచ్‌గా పోటీ చేసి ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పటి పార్టీ ప్రాణంగా పని చేశారు. పార్టీ తనకు అప్పగించిన పని తుచ తప్పకుండా ఆచరణలో పెట్టారు. పార్టీలో వారి సేవలకు గుర్తింపుగా డైరెక్టర్ పదవీ ఇవ్వడం వల్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవీ రావడానికి సహకరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కి, సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్యకు, మండల పార్టీ అధ్యక్షులు రామినేని రాజాకి, పార్టీలో పెద్దలకు, కూటమి నాయకులకు రాజా దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. నేడు గొల్లపూడిలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

12న సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

విజయవాడ : సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై 30 సంఘాలు కలిపి విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ప్రధాన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు, సర్వీస్ నిబంధనలు, స్పష్టమైన జాబ్ చార్టులు అమలు, ప్రమోషన్లు అంతర్ జిల్లా బదిలీలు, సొంత మండలంలో ఉద్యోగం చేసుకుని వెసులుబాటు కల్పించాలనే డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. అలాగే జూలై 12వ తేదీన విజయవాడలో జరుపుకునే మొట్టమొదటి పదివేల ఉద్యోగులతో ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జి జోసెఫ్ కిషోర్, టి కోటేశ్వరరావు, టి ప్రభాకర్, వి శ్రీనివాస్, ఎం రాజ్యలక్ష్మి, టి దుర్గాప్రసాద్, పి నరసింహారావు, అప్పికట్ల కిషోర్, కె వి రాజేష్ బాబు, కెఎస్‌కె.వెస్లీ, జయకర్, మహబూబ్ బాషా, అనుషా, అనురాధ, షణ్ముక్, పి రాజు, దుర్గా ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజు, మజిమున్నిసా, తిరుమున్నిసా, సత్యనారాయణ, మొజెస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో గత వారంలో శంకర్ నేత్రాలయం విజయవాడ వారి వద్ద గౌరవరం మరియు ముండ్లపాడు గ్రామాల ప్రజలకు ఉచిత కంటి నేత్ర చికిత్సలలో శుక్లములు, పొరలు, ఆపరేషన్లు చేసిన వారికి శనివారం ఆయా గ్రామాలలో మరల పరీక్షలు నిర్వహించి చివరిగా కళ్లజోళ్లను అందించేందుకు గానూ గౌరవరం గ్రామంలో 29 మందికి, ముళ్లపాడు గ్రామంలో 32 మందికి పరీక్షలు నిర్వహించి 61 మందికి కళ్ళజోళ్లు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవరం సర్పంచి మొత్తవరపు వెంకటేష్ పావని, విద్యా కమిటీ చైర్మన్ షేక్ వద్దండు సైదా, కొప్పుల రాము, కటకం నాగ గ్రూపు సభ్యులు, ముండ్లపాడు గ్రామ టిడిపి నాయకులు ఉమ్మినేని పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' చిత్తశుద్ధితో అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ, సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తల్లికి వందనం పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని సిపిఎం కార్పొరేటర్ బోయి సత్య బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనల పేరిట తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భారత విద్యార్థి సమైక్య, సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ కొత్తపేటలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బోయి సత్య బాబు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తామంటూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీని కూటమి నేతలు నేడు విస్మరించడం సిగ్గుచేటు అన్నారు. తల్లికి వందనం పేరిట పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ రూ.15 వేల నగదును బ్యాంకు ఖాతాలో వేస్తామని వాగ్దానం చేసి తీరా అధికారంలోకి వచ్చాక వారి ఖాతాలలో రూ. 13వేలు జమ చేయడం దుర్మార్గం అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో తల్లికి వందనం అమలు చేయకపోగా 2025 - 26 విద్యా సంవత్సరానికి కింద ప్రకటించిన అర్హుల జాబితా తప్పులు తడకగా ఉందన్నారు. ఇద్దరు బిడ్డలు ఉంటే ఒకరికే పథకం వర్తించేలా జాబితా విడుదల కావటంతో పాటు రూ. 12 వేల పైబడి ఆదాయంకల్గి వున్నారంటూ స్కీమ్ వర్కర్లు, వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకం వర్తింప చేయకపోవటం అన్యాయమన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమినేత నేతలు నేడు అంతకుమించిన షరతులు పెట్టి లబ్ధిదారులతో పాటు నగదును తగ్గించడం సరికాదని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగరసహాయ కార్యదర్శి కె.వెంకటరత్నం సిపిఎం నాయకులు ఎండి వజీర్, ఎస్.కె రజాక్, సిహెచ్ రమణ పాల్గొన్నారు. **గంపలగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా తల్లికి వందనం స్కీం వర్కర్లకు (ఆప్కాస్) కూడా వర్తింపచేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సి.హెచ్.సుప్రజ కోరారు. తోటమాల్‌లో ఉన్న సిఐటియు కార్యాలయంలో శనివారం స్కీన్ వర్కర్ల విస్తృత స్థాయి సమావేశం మండల సిఐటియు కార్యదర్శి జానపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రజ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్తరించడంపై ఆగ్రహించారు. అంగన్వాడీ, ఆశ, పారిశుధ్య కార్మికులకు ఈ తల్లికి వందనం వర్తింపచేయాలని సుప్రజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యం ప్రభుత్వ సేవా కార్యక్రమాల్లో పాల్గొని, అతి తక్కువ వేతనాలతో గడుపుతున్న పైన తెలిపిన కార్మికులకు కుటుంబాలకు ఈ ఏడాది తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న కార్మిక హక్కుల కోసం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని స్కీం వర్కర్లకు పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తల ప్రతినిధులు సుమలత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తల్లికి వందనం అర్హులు లిస్టులో మున్సిపల్ కార్మికుల పిల్లల పేర్లు లేకపోవడంతో కార్మికులు మస్టర్ల పాయింట్లు దగ్గర శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారాంలోకి వచ్చే ముందు వచ్చేది కార్మిక సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పి వచ్చిన తరువాత ఆ కార్మికులకే తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు నాగరాజు, సురేష్, రమణ, రవి, విజయమ్మ, తాటి వెంకటేశ్వరావు, కృష్ణవేణి, కార్మికులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

సిపిఎం అభిమాని కృష్ణాయమ్మకు నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఐద్వా మహిళా కార్యాలయ స్థల దాత, మానవతా వాది కొండపల్లి సిపిఎం సీనియర్ తూమాటి సాంబయ్య సతీమణి కృష్ణాయమ్మ (82) అనారోగ్యంతో చనిపోవటంతో సిపిఎం నేతలు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమాటి కృష్ణాయమ్మ కొండపల్లి ఐద్వా ఆఫీస్ స్థల దాత అని, కామ్రేడ్ తుమాటి సాంబయ్య రైతు సంఘం మైలవరం నియోజకవర్గ అధ్యక్షులుగా రైతుల సమస్యలపై పనిచేస్తున్నప్పుడు తుమాటి సాంబయ్య వెన్ను తట్టి రైతుల సమస్యలపై పోరాడాలని ప్రోత్సహించేవారన్నారు. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీకి వీరాభిమానిగా ఉండే వారు. కార్యకర్తల పట్ల ఆప్యాయంగా పలకరించే వారు ఆమె ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, కమిటీ సభ్యులు ఎస్‌కె బాషా పార్టీ సభ్యులు బాడిశ వెంకటేశ్వరరావు, కె నారాయణ, లాయర్ చింతా నాగరాజు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణాయమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలోని 600 మంది మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసినట్లు ఎంఎల్ఎ బొండా ఉమా తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఎకెటిపి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రణీత్ అనే విద్యార్థికి 592 మార్కులతో మెరిట్ సాధించిన విద్యార్థికి ఎంఎల్ఎ బొండా ఉమా తన సొంత నిధులతో నగదును అందజేశారు. సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టిడిపి కార్యాలయంలో 2024 - 2025 విద్యా సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత కనపరిచిన పదో తరగతి విద్యార్థులకు బొండా ఉమా 2 వేల విలువైన స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్, స్టేషనరీ వస్తువులను ఎంఎల్ఎ సంతకంతో కూడిన మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేశారు.

ఇబ్రహీంపట్నం : షైనింగ్ స్టార్స్‌గా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను రూ.5వేల నగదు పురస్కారాలతో పాటు, దుశ్శాలువతో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు సత్కరించారు. మైలవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో చదువులకు సహకరిస్తానని బాగా చదువుకునే విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని చెప్పారు. కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు డి. జ్యోత్స్న (581), ఎమ్ వి మనస్విని (580), బి.యశ్విని (577) మార్కులతో నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంలోనే కొండపల్లి హై స్కూల్ ప్లస్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ కల్యాణి 944/1000బీ ఎన్ శ్రావణి 912/1000, జి నాగాంజలి 871/1000లను రూ.10 వేలు, దుశ్శాలువతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు భాగవతుల హేమలత విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మైలవరం : ప్రతిభకు పేదరికం అడ్డు కాదని స్థానిక ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్లో ప్రతిభ చూపిన 130 మందికి రూ.7.40లక్షలు షైనింగ్ స్టార్స్ పేరిట విద్యార్థులను శనివారం స్థానిక ఎస్‌విఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించి తన సొంత నిధులతో నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు తన ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందన్నారు. పాఠశాలలో చదివి ఎందరో గొప్ప వాళ్ళు అయ్యారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించడంతో పాటు నైపుణ్యాన్ని కూడా మెరుగుపరచుకొని దానికి అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకుంటూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం మైలవరం నియోజకవర్గ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ద్వారా 222 మందికి మంజూరైన రూ.43.20, లక్షల విలువైన కృత్రిమ అవయవాలు ఉపకరణాలను మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.



విజయవాడలో నగదు బహుమతులు, బ్యాగులు అందుకున్న విద్యార్థులు

ఎన్‌టిటిపిఎస్ కార్మిక నేతకు సన్మానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ గుంటూరులో 11వ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభల సందర్భంగా విటిపిఎస్ రీజనల్ మాజీ కార్యదర్శి , రిటైర్డు ఉద్యోగి కామ్రేడ్ ఇర్లా కొండలరావును సన్మానించారు. యూనియన్ పట్ల అంకితభావంతో నిజాయితీగా కార్మికులకు అండగా కృషి చేసిన కొండలరావు సేవలను గుర్తించి సన్మానం నిర్వహించారు.

కళ్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపన

విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గంలోని 63వ డివిజన్ పాత రాజీవ్ నగర్‌లో హైస్కూల్ వద్ద రూ.99 లక్షల వ్యయంతో కళ్యాణ మండప నిర్మాణానికి ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో తాను ఎంఎల్ఎగా ఉన్నప్పుడు పాత రాజీవ్ నగర్ ప్రాంతవాసులకు ఉపయోగపడేలా కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మరలా ఇప్పుడు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైడితలసి, అధ్యక్షులు లబ్బా వైకుంఠం, ఇంచార్జ్ మోతుక్కూర్ ఖాసిం, సెక్రెటరీ కోలా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బత్తుల కొండ, లబ్బ దుర్గా, పైడి శీను, దుర్గాప్రసాద్, పెద్ది శ్రీను, రమణ, బిడిఆర్, బెజ్జం జైపాల్, ఎస్‌కె.భాష, ఎస్‌కెఅన్వర్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు విరాళం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మకి వాహన, వస్తు కానుకలను యాత్రికులు సమర్పించారు. శనివారం వరంగల్‌కు చెందిన జి.భూపాల్ రెడ్డి కుటుంబంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసి, ఆది దంపతులను దర్శించుకున్నారు. అనంతరం ఇఒ వికె శీనానాయక్‌ను కలిసి దేవస్థానానికి రూ.4,75,000 విలువ గల రెనాల్ట్ క్విడ్ కారు, 21గ్రాముల బరువు గల ముత్యాలు, రాళ్లు పొదిగిన బంగారు నక్లేస్ సమర్పించారు. దానితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీర్వచనం, చిత్రపటం తీర్థ ప్రసాదం అందజేశారు.

రూ. 822 కోట్లతో అభివృద్ధి పనులు : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో మొదటి ఏడాది రూ 822 కోట్లతో అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అవనిగడ్డలో ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తోంన్నారు. మొదటి ఏడాది వివిధ శాఖల ద్వారా 601 కోట్లు అభివద్ధికి, రూ 221 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో జలవనుల శాఖ ద్వారా 12.191 కోట్లు, వ్యవసాయ శాఖ ద్వారా రూ 204. 352 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ 53.320 కోట్లు, ఆర్ అండ్ బి శాఖ ద్వారా రూ 28.060 కోట్లు, శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ 1. 488 కోట్లు,హౌసింగ్ శాఖ ద్వారా రూ 2.12 0 కోట్లు, విద్యుత్ శాఖ ద్వారా రూ 4.730 కోట్ల అభివద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మత్స్య శాఖ ద్వారా రూ 4.135 కోట్లు, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ 4.175 కోట్లు, వెలుగు శాఖ ద్వారా రూ 280.400 కోట్లు అభివద్ధి పనులు



చేసినట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ బీసీ సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మరిన్ని అభివద్ధి పనులు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా 221 కోట్ల 7 లక్షల 60 వేలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అదే విధంగా దివిసీమకు క్యాచ్ తెచ్చిపెట్టే నాగాయలంక గుల్లలమోద వద్ద ఏర్పాటు చేయనున్న క్షిపణి కేంద్రం నిర్మాణానికి ప్రధానమంత్రి రూ.1500 కోట్లు మంజూరు చేశారని, ఇది దివిసీమకు ఆమనగడ్డ నియోజకవర్గానికి గొప్ప విజయం అన్నారు. అదేవిధంగా కీలకమైన అవుట్ ఫాల్ స్లూయిజులు పునర్ నిర్మాణానికి నిధుల సాధనకు కషి చేస్తున్నట్లు తెలిపారు. దేశానికి పథకాలు అందిస్తున్న క్రీడాకారుల కోసం నాగాయలంక వాటర్ స్పోర్ట్స్ అకాడమీ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేశామని, పులిగడ్డ ఆక్విడేట్ సమగ్ర అభివద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి అభివద్ధి పనులు పారదర్శకంగా నిర్వహించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గన్నవరం : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, ఆర్యవైశ్య ప్రార్ధన మందిరంలో మడుపల్లి బాలకృష్ణ మూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకార ప్రమాణం చేయించారు. డైరెక్టర్లుగా ముక్కామల సురేంద్ర బాబు, జాస్తి విజయ భూషణ్ కుమార్, గన్నే వెంకట్రావు, నర్రా సీతారామరావు నూతన అధ్యక్షులుగా వీసం ప్రసాదరావు ఉపాధ్యక్షుడుగా పువ్వల ఆదినారాయణ, కార్యదర్శిగా వి. వి కష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శిగా వడ్లమూడి వెంకటేశ్వరరావు కోశాధికారిగా పొట్లూరి రామకష్ణరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఉడతా రామకృష్ణ, సయ్యద్ లాల్, మామిడి రాధిక, మోటమర్రి శేఖర్ చైర్మన్ మడుపల్లి బాలకష్ణ మూర్తి కో చైర్మన్ కొల్లి సత్య జగదీశ్వర రావు కన్వీనర్ కర్రా వరప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. అలాగే గౌరవ సలహాదారులుగా ముక్కామల సుబ్బారావు, సూరగాని వెంకటేశ్వరరావు షేక్ ఆదం వలీ పల్లగాని శివాజీ, శ్రీకాకులపు సత్యనారాయణ సాయిలు ప్రమాణస్వీకారం చేశారు.

సిఎంపై వ్యాఖ్యలకు ఖండన

విజయవాడ : సిఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను టిడిపి విజయవాడ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ జగన్ వ్యాఖ్యానించడాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు శనివారం గురునానక్ కాలనీ లోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎమ్.డి.ఇర్ఫాన్ పాల్గొన్నారు.

17న పెనుగంచిప్రోలు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన ఈనెల 17న మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తామని వివిధ శాఖ అధికారులు తప్పుగా హాజరు కావాలని కోరారు. వివిధ శాఖ అధికారులు నివేదికను రెండు రోజులు ముందుగా కార్యాలయంలో సమర్పిం చాలని సూచించారు.



దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలో గల వసతి గృహాల్లో దోమల నివారణకు మలాథియాన్ పౌడర్‌ను రెడ్డిగూడెం వైద్యాధికారి పి.మణిబాబు ఆధ్వర్యంలో స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఏంటమాలజీ అధికారి రామచంద్రుడు, జిల్లా మలేరియా అధికారి మోతిబాబు, సబ్ యూనిట్ అధికారి బాబా వలి సూపర్వైసర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఎఎన్ఎమ్‌లు, ఎంఎల్‌హెచ్‌పి/సిహెచ్ఒలు, ఆశలు, స్కూల్ ప్రిన్సిపాల్, స్టాఫ్ పాల్గొన్నారు.

28న 'చలో తెనాలి'

విజయవాడ : తెనాలిలో దళిత యువకులపై తాలిబన్ దాడిని నిరసిస్తూ ఈనెల 28న చలో తెనాలి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దళిత యువకులపై తాలిబన్ పోలీస్ దాడిని నిరసిస్తూ ఈనెల 28న చలో తెనాలి పిలుపునిస్తున్నట్లు శనివారం విజయవాడలో ప్రెస్ క్లబ్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రెండు నెలల క్రితం తెనాలి అయితనగర్లో అంబేద్కర్ విగ్రహం తొలగించే విషయంలో పోలీస్ అధికారులకు స్థానిక దళితులకు మధ్య వివాదం ఉందన్నారు. తెనాలి స్థానిక ఎంఎల్ఎ, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రోత్బలంతోనే తెనాలి దళిత యువకులపై గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు 2 టౌన్ సిఐ రాములు నాయక్, 3 టౌన్ సిఐ రమేష్ బాబు దాడి చేశారన్నారు. తెనాలి యువకుల పోలీసు దాస్తీకంపై సమగ్ర విచారణ చేసేందుకు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ ఎంక్వైరీ జరపాలని సమావేశంలో డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని తెనాలి సిఐలు రాములు నాయక్ రమేష్ బాబులను ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్ల సాధనకు తలపెట్టిన చలో తెనాలిని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. దళిత పరిరక్షణ సమితి అధ్యక్షులు నేలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పలువురు రాష్ట్ర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు, కోడి కత్తి శ్రీను కేసు న్యాయవాది సలీం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విమాన ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - కంచికచర్ల : ఇటీవల అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు, మెడికో విద్యార్థులు మృతి చెందటం బాధాకరమని అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.రామ్మోహన్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని పరిటాల పరిధిలో గల అమ్రిత.సాయి ఇంజనీరింగ్ కళాశాలలో అహ్మదాబాద్ విమానం ప్రమాదం మృతులకు నివాళులు అర్పించారు. మతి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతులకు సంతాప సూచికగా ప్రిన్సిపాల్ ఎం శశిధర్, విద్యార్థులు, అధ్యాపకులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.



గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం



యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

- సావరగూడెంలో కొండగట్టు లూటీ
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-గన్నవరం : గ్రావెల్ మాఫియా తెగపడుతోంది. కొండగట్టులను అక్రమంగా కొల్ల కొట్టేస్తుంది. అంతా మైనింగ్ అధికారులకు తెలిసే జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా కొండపై గ్రావెల్, కంకర యథేచ్ఛగా తరలిపోతోంది. గన్నవరం మండలం సావరగూడెం లో గ్రావెల్ లూటీ జరుగుతుంది. ఓ ప్రముఖ వ్యక్తి ఈ వ్యవహారం సాగిస్తున్నాడని తెలుస్తోంది. కొండగట్టుపై ఈ అక్రమ తవ్వకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలాగే పరిస్థితి కొనసాగితే కొద్ది రోజులకు కొండ కరిగిపోతుంది. పొక్లెయిన్, లారీలు పెట్టి గ్రావెలు తరలించుకుపోతున్నారు. లక్షల విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సావరగూడెం, ముస్తాబాద శివారులోని కొండను కొంతమంది రాజకీయ శక్తులు ఆక్రమించాయి. మరోవైపు అక్రమ తవ్వకాలు పగలు రాత్రి తేడా లేకుండా యదేచ్ఛగా జరుపుతున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లను ప్రోక్లైన్తో పగలకొట్టేస్తున్నారు. రైల్వే లైన్ పనులకు ఈ రాయిని తరలిస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా గ్రావెల్ విజయవాడ పరిసర ప్రాంతాలకు తోలేస్తున్నారు. జేబులు నింపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పంచాయితీకి రూపాయి ఆదాయం రావడంలేదని చెబుతున్నారు. రోడ్లు కూడా దెబ్బతింటున్నాయని అంటున్నారు. ఆక్రమ తవ్వకాలను ఆపే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ఈ అక్రము గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలని, ఇప్పటివరకు తగ్గిపోయిన దానికి కొలతలు వేసి డబ్బు కట్టించాలని ముస్తాబాద గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ గ్రావెల్ ఎక్కడకు వెళుతుందంటే.. పొక్లెయిన్ పెట్టి తవ్వుతున్న రబ్బీసు లారీ ద్వారా విజయవాడ, పరిసర ప్రాంతాలకు తరలి పోతుందని చెప్పారు. కంపెనీ స్థలాలను మెరక చేయడానికి ఇక్కడ నుండి గ్రావెల్ తీసుకుపోయి అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదట. సాధారణ వ్యక్తులు ఎవరైనా ట్రాక్టర్ గ్రావెల్ని తీసుకు వెళితే కన్నెర్ర చేసే రెవెన్యూ అధికారులు, లారీలకు లారీలు గ్రావెల్ తరలిపోతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్న గ్రామస్థులను ఉత్పన్నమవుతుంది. ఈ గ్రావెల్ తో గ్రామంలో రోడ్ల పోసిన పరిస్థితి కనిపించడం లేదని చెబుతున్నారు.

విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు



ప్రజాశక్తి - గుడివాడ : మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన మండపంలో సంకష్టహర చతుర్ద సంద ర్భంగా శనివారం లక్ష్మీ గణపతి హెూమ పూజల్లో 116 మంది దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం హెూమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. లోక కళ్యాణార్థమే దేవస్థానంలో సంకటహర శ్రీలక్ష్మీ గణపతి హెూమ పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాస రావు(వాసు) తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతలుగా జడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం తోటపల్లి అండర్ -15 బాలికల వాలీబాల్ హెచ్‌సిఎల్ టోర్నమెంట్ సెలక్షన్స్‌లో 9వ తరగతి చదువుతున్న బాలికలు జె.హేమాదేవి, జి ఫణి నాగ దీపిక, పి.యక్షిబా, పి.శ్రీ వెంకట దుర్గ ఎంపికయినట్లు పి.డి.ఎస్.రత్నం మరియు ఎస్కే రిజ్వానా తెలిపారు. వీరు బెంగళూరు నందు జూన్ 24, 25 తేదీలలో జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనటానికి వీరు అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్ టీమ్‌కి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరికి కొండపల్లి బాలికల హెచ్‌ఎం డాక్టర్ హేమలత, ఎస్‌ఎంసి చైర్మన్ బాబ్జీ బీ మాట్లాడుతూ అభినందనలు తెలిపారు. వీరికి కోచింగ్ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట స్థానిక పుట్రెల రోడ్డులో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఆత్కూరి ప్రిన్స్‌ని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. అతని దగ్గర నుంచి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో తిరువూరు సిఐ కె.గిరిబాబు మాట్లాడుతూ 1.500 కేజీలు గల గంజాయి ఒరిస్సా నుండి కొనుగోలు చేసి విజయవాడ ఏలూరు పరిసర ప్రాంతాల్లో చిన్నచిన్న ప్యాకెట్స్‌లా చేసి అమ్ముకుంటూ జీవనాధారం సాగిస్తున్న ఆత్కూరి ప్రిన్స్, ఇద్దరు వ్యక్తులు విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండగా విస్సన్నపేట ఎస్సై జి.రామకృష్ణకు వచ్చిన సమాచార నిమిత్తం వారిని అడ్డగించగా ప్రిన్స్ అనే వ్యక్తిని అతని వద్ద 1.500 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆత్కూరు ప్రిన్స్‌పై భద్రాచలంలోను, విజయవాడ టూ టౌన్‌లో కూడా పాత కేసులు ఉన్నట్లుగా తెలిపారు. ఎవరైనా గంజాయి నాటు సారా మొదలగు మత్తు పదార్థాలు సేవించినా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.రామకృష్ణ, తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వత్సవాయి : బైకు లారీని ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు ప్రకారం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినుగడప గ్రామానికి చెందిన బత్తుల దుర్గేష్ (45) హుజూర్ నగర్ కు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తూ మండల కేంద్రంలోని మునేటి అవతల వాటర్ ప్లాంట్ నుండి మంచినీటి బాటిల్స్ లోడుతో వెళ్తున్న లారీని బైక్ అదుపు చేయలేక ఢీకొట్టాడు. దీంతో బైకు లారీ కిందకు దూసుకెళ్లింది. మున్నేరు కాజువే దాటగానే ఉన్న మలుపు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో దుర్గేష్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - వత్సవాయి : మున్నేరు అవతల తువ్వ కాల్వలోకి ఇసుక ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన మండలంలోని ముచ్చింతాల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం మున్నేరు నుంచి లింగగూడెం వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న తువ్వ కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సీటుకు స్టీరింగ్‌కు మధ్య ఇరుక్కున్న డ్రైవర్ను స్థానికులు బయటికి తీశారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అయితే ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్నారని దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'శాతవాహన' శిథిలాల కింద విద్యార్థుల జీవితాలు

విజయవాడ శాతవాహన కళాశాలను రాత్రికి రాత్రి కూల్చివేసిన ఘటన ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన కూల్చివేత ఘటన చెడు సంప్రదాయానికి తెర తీస్తుందని అంటున్నారు. నగర చరిత్రలో ఇలాంటివి ఎన్నడూ చూడలేదంటున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న కళాశాలను ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి సమయంలో కొందరు కూల్చివేయడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. వాచ్‌మన్‌ను బెదిరించి మరీ పొక్లయినర్లతో సహా కళాశాల ఆవరణలోకి ఇష్టారాజ్యం వచ్చి నేలమట్టం చేయడం ఆందోళన కలిగించింది. బోయపాటి శ్రీనివాస అప్పారావు పేరుతో అక్కడ బోర్డులు సైతం ఏర్పాటు చేయడం, పోలీసులు సైతం ఈ ఘటనను అడ్డుకోలేకపోవడంతో విద్యార్థులు, కళాశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వందలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు, పదుల సంఖ్యలో అధ్యాపకులకు, కళాశాలకు చెందిన రికార్డులు, లైబ్రరీకి పుస్తకాలు, ఫర్నీచర్ కూల్చివేత శిథిలాలు కింద ఉండిపోవడంతో చూపరులను విస్మయానికి గురిచేస్తోంది.

1969లో ఏర్పాటైన శాతవాహన కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. గత 56 ఏళ్లుగా వేలాది మంది పేద, సామాన్య, మధ్య తరగతి విద్యార్థులు దీనిలో విద్యనభ్యసించారు. ఇప్పటికీ వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. పదుల సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే ఐదెకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న ఈ కళాశాలకు చెందిన సొసైటీ స్థలం విషయమై వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. గత కొన్నేళ్లుగా కళాశాల యాజమాన్యం మధ్య విభేదాల కారణంగా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. కొందరు అధికార పార్టీ పెద్దలు, మరికొందరు గ్రూపులుగా తయారై వందల కోట్ల రూపాయల విలువైన కళాశాల సొసైటీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో తనను టిడిపి ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అనుచరులు ఇటీవల తనను కిడ్నాప్ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించడం సంచలనం కలిగించింది. కళాశాల సొసైటీ స్థలాన్ని కబ్జా చేసేందుకు తనపై ఒత్తిడి తీసుకువచ్చి బెదిరించారని ప్రిన్సిపాల్ చెప్పుకొచ్చారు. పోలీసుల దృష్టికి కూడా తీసుకెళుతున్నట్లు ప్రకటించారు. ఈవ్యవహారం ఇలా సాగుతుండగానే... ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి సమయంలో కళాశాల కూల్చివేత ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా కూల్చివేశారు. తమకు

వీక్షణం

అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో కూల్చివేసినట్లు బోయపాటి శ్రీకృష్ణ చెబుతున్నారు. అందుకే భవనాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. బోయపాటి శ్రీనివాస అప్పారావు పేరుతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈవిషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశామని ఆయన అంటున్నారు. అయితే పోలీసులు దీనిపై మరో రకంగా చెబుతున్నారు. కళాశాల భవనాలను బోయపాటి అప్పారావు నేలమట్టం చేయించినట్లుగా పోలీసులు వెల్లడించారు. తమకు ఎటువంటి కోర్టు ఉత్తర్వులు అందలేదని స్పష్టం చేస్తున్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది కూడా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాల స్థలం కొనుగోలులో తమ పాత్ర ఉందని, ప్రతి అధ్యాపకుడు సుమారు రూ.4 లక్షల చొప్పున చెల్లించామని, ఇప్పటికీ తమ వద్ద రశీదులు ఉన్నాయని అంటున్నారు. ఈ ఘటనపై పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కూల్చివేతలను పరిశీలించేందుకు వెళ్లిన సిపిఎం, విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు, శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కూడా తలెత్తాయి. ఈక్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొందరు కోర్టు తీర్పులపేరుతో అడ్డగోలుగా కబ్జా చేస్తుంటే ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుందని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, పోలీసు కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. కళాశాల భవనాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేడం దారుణమని, కొంతమంది స్వార్థం కోసం విద్యార్థులను బలిపశువులను చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కళాశాలను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, కబ్జాకోరుల నుంచి కళాశాల భూమిని రక్షించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలను అక్రమంగా కూల్చివేయడమే గాక పెద్దఎత్తున అల్లర్లకు పాల్పడ్డారని బోయిపాటి శ్రీనివాస్ అప్పారావు, డి.శ్రీకాంత్, వి శ్రీనివాసరావు, ఎం.రమా సత్యనారాయణతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మీడియాకు వెల్లడించారు. సెక్షన్లు 324/క్లాస్ 5, 329/4 బిఎన్‌ఎస్ కింద వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పొక్లయినర్లు, ఇతర వాహనాలతో కళాశాలను పడగొట్టినట్లుగా పేర్కొన్నారు. అయితే ఘటన జరిగి పది రోజులవుతున్నా పోలీసులు ఇప్పటికీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. దీంతో ఆందోళనలు ఉధృతమ వుతున్నాయి. కశాశాలను స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నిర్వహించాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు. విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా జిల్లా ఇన్చార్జి మంత్రి, ఎంపి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని, తక్షణమే కళాశాలను పునర్నిర్మించి వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

- ఎం.బి.నాథన్.

అండర్ - 19 క్రికెట్ టోర్నీలో వెస్ట్, కృష్ణా జట్ల విజయం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎసిఎ సెంట్రల్ జోన్ అండర్ -19 బాలికల అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో వెస్ట్ గోదావరి, కృష్ణా జట్లు విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో శనివారం ఉదయం వెస్ట్ గోదావరి ప్రకాశం జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు 53 పరుగులతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్ గోదావరి జట్టు 50 ఓవర్లులో ఏడు వికెట్లు నష్టానికి 184 పరుగులు చేసింది. జట్టులోని పి.రిషికా కృష్ణన్ 86 పరుగులు చేశారు. ఎ. మల్లి 21 పరుగులు చేశారు. ప్రకాశం జట్టు బౌలర్ వి.సేతు సాయి 18 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం 184 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రకాశం జట్టు 43.3 ఓవర్లలో 130 పరుగులు చేసి అంతాఆ వుటయ్యారు. జట్టులోని సేతు సాయి 28 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టు బౌలర్లు కె.వై.ఎం.వల్లి 12 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు, పి.కవిత 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసుకున్నారు. 53 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించిన వెస్ట్ గోదావరి జట్టుకు నాలుగు పాయింట్లు ప్రకటించారు.

కృష్ణా 107 పరుగులతో విజయం : మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్ కృష్ణా - గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో కృష్ణా జట్టు 107 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు 50 ఓవర్లులో ఆరు వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. జట్టులోని వి.అక్షయ 70, ఆర్.చేతన ప్రియ 51, టి. గుణ చంద్రిక 43, ఎం.డి.మెహెక్ 40 పరుగులు







చేశారు. గుంటూరు బౌలర్ బి.సాయి దీప్తి 30 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 304 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటూరు జట్టు 50 ఓవర్లులో 8 వికెట్లు నష్టపోయి 197 పరుగులు చేసి ఓటమి చెందింది. జట్టులోని ఎం.హాసిని 101 పరుగులు, కె.హరి ప్రియ 18 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు బి.స్రవంతి 46 పరుగులిచి మూడు వికెట్లు, అంజన్ 24 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసుకున్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సాటి మనిషికి అందించే సహాయాలలో నిండు ప్రాణాన్ని కాపాడే సాయం వలన విలువ మరింత పెరుగుతుందని కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొండపల్లిలోని బీపీసీఎల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డా.వెలగా జోషి ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అనేకమంది రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదిస్తుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల మనకు ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఆయన అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వెలగా జోషి మాట్లాడుతూ మనిషి విలువైన ప్రాణాన్ని కాపాడటానికి తమవంతు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిపిసిఎల్ నుంచి ఆదిత్య కుమార్ వర్మ, వనము లోహిత్, వేణుగోపాల్ స్వరాజ్, రామ్ టేకే హాజరయ్యారు. రెడ్ క్రాస్ సొసైటీ తరపున చిట్టిబాబు, డాక్టర్ మదన్ హాజరయ్యారు. ఈ శిబిరంలో 24 మంది బీపీసీఎల్ సిబ్బంది రక్తదానం చేశారు. **ఇబ్రహీంపట్నం :** జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌టిటిపిఎస్‌లో వరల్డ్ బ్లడ్ డోనార్స్ డే సందర్భంగా రక్తదాన శిబిరం, అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి అడిషనల్ డి.యమ్, హెచ్.ఓ, డాక్టర్ జె.ఉషారాణి ప్రారంభించారు. ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ యమ్ పి. శివ రామాంజనేయులు, విశిష్ట అతిథి డాక్టర్ రంజిత విజయవాడ మెడికల్ ఆఫీసర్ మాట్లాడారు. **నందిగామ :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో నందిగామలో అవగాహన ర్యాలీ



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

నిర్వహించారు. నందిగామ ఏరియా హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరావు, హాస్పిటల్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఇన్చార్జ్ డాక్టర్ సింధూర మాట్లాడారు. డాక్టర్ సంపత్ రక్తదాతల అవసరం గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏపూరి నాగేశ్వరావు, ఇన్చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఒ డా.రమేష్, డా.జగదీష్, డా.మాధవిలత, డా.సింధురా, డా.సంపత్, హెడ్ నర్స్ సూర్యావతి, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.